క్లుప్తంగా

వామన, పరశురామ అవతారాలలో జగన్నాథస్వామి


గుండిచా మందిరంలో పూజలు అందుకుంటున్న స్వామివారు

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు శుక్రవారం స్వామివారిని వామన, పరశురామ అవతారాలలో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకుడు హరి ఆధ్వర్యంలో అర్చకులు ఆర్.పార్థసారథి ఆచార్యులు, పి.రవికుమార్, సురేష్ గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పు చేసి పూజా కార్యక్రమాలు జరిపారు. దూపదీప నైవేద్యాలతో స్వామివారికి పూజలు జరిపిన అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: పాచిపెంట, మక్కువ, సాలూరు మండలాల్లో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కిశోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. దీని వలన సాలూరు పట్టణం, గుమడాం, మండలంలో జీగిరాం, కూర్మరాజుపేట, మక్కువ, పాచిపెంట మండలాల్లో అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7గంటల నుండి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వి.కిశోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కొండపుట్టి, బొడ్డుసామంతవలస, ఎర్రసామంతవలస ఫీడర్ల పరిధిలో వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గోతిలో దిగబడిన ఇసుక లారీ

భామిని : మండలంలోని గురండి కూడలి వద్ద శుక్రవారం మధ్యాహ్నం ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏబీ రోడ్డులోని గోతుల్లో ఒడిశా నుంచి వస్తున్న ఇసుక లారీ దిగబడిపోయింది. గురువారం కూడా ఇలానే గోతుల్లో లారీలు దిగబడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనచోదకులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం కూడా అదే పరిస్థితి ఏర్పడడంతో వాహన చోదకులు అసహనం వ్యక్తం చేశారు. జేసీబీ తెచ్చి లారీని తీయాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆర్టీసీ బస్సులను బిల్లుమడ వద్ద నిలిపివేశారు. భామిని, బత్తిలి నుంచి వచ్చిన విద్యార్థులు బస్సుల్లేక అవస్థలు పడ్డారు.

కండ్లకలక నివారణపై అవగాహన


కండ్లకలక వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి

కురుపాం: స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరంలో కండ్లకలక వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి ఆ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. అంతకు ముందు శిబిరానికి విచ్చేసిన 38 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాల కోసం సిఫారసు చేశారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు రమేష్, మాలిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు చేపట్టేలా చైతన్యపరచండి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఏఈ, మేనేజర్, తదితరులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ద్వారా సంక్రమించిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను చైతన్యపరచాలని గృహనిర్మాణ శాఖ ఏఈ మాధవరావు, నగర పంచాయతీ మేనేజర్ టి.జయరామ్ అన్నారు. పట్టణ పరిధిలోని సచివాలయ సిబ్బందితో శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాధవరావు మాట్లాడుతూ, లుంబూరు రహదారిలో గల అర్బన్ కాలనీలో వంద రోజుల్లో ఐదు వందల గృహ నిర్మాణాల్లో సంపూర్ణ పురోగతి వచ్చేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఇందుకు సంబంధించి పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని గృహ నిర్మాణ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ సూచించారు.

జాగ్రత్తలు పాటిస్తే

చెరకులో అధిక దిగుబడులు


బుడ్డిపేటలో గోలుసుకట్టుతో ఉన్న చెరకు పంట

సీతానగరం: మండలంలో నీటివనరులున్న రైతులు 2024 – 25 క్రషింగ్ సీజన్‌లో పండిస్తున్న చెరకు పంటను గాలికి నేలకు పడిపోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది. ఈ ప్రాంత రైతులు దశాబ్దాల కాలంగా చెరకు పంటను వాణిజ్య పంటగా గుర్తించి సాగు చేస్తున్న కారణంగా మమ్ము చెరకు 2500 ఎకరాలు, మొక్క చెరకు(ప్లాంటేషన్)పంట 2 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగు చేస్తున్నారు. మళ్ళలో చెరకు ఏపుగా పెరడం వలన గాలికి నేలకొరిగితే చెరకు పంట దిగుబడి తగ్గుతుందని రైతుల అనుభవం చెబుతుంది. ఈ ఏడాది చెరకు సాగుకు వాతావరణం అనుకూలించడంతో పాడవుగా పెరగడంతో ఈదురుగాలితో కూడిన వర్షాలు కురుస్తున్నందున నేలమట్టం


వెంకటాపురంలో గుడ్డాం కట్టుతో ఉన్న చెరకు పంట

కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏపుగా పెరిగిన చెరకు తోటకు రక్షణగా రైతులు చెరకు పాదులను నాలుగు దిక్కులా సేకరించే చెరకు కర్రలను గుడ్డాం కట్టుకట్టడం, తారెల్లో ఉన్న చెరకు కర్రలను కలిపిన చెరకు కర్రలను గొలుసు కట్టు విధానం ద్వారా చెరకు నేలమట్టం కాకుండా రక్షించుకోడానికి రైతులు చర్యలు చేపట్టాల్సి ఉంది. చెరకు పంటలో బోదెల మధ్య చెరకు పాదుల్లో ఇప్పటికే ఎరువులు వేయడం, కలుపు తీయడం ఎప్పటికప్పుడు చేస్తున్నందున చెరకు పాడవుగా పెగడంతో రైతులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. అయినా ఈదురుగాలికి తట్టుకోలేని మళ్ళలో చెరకు తోట పడిపోవడం ముచ్చలున్న(కఋపులు)దగ్గర వేళ్ల రావడంతో రైతులు మరింత జాగ్రత్తలు చేపడుతున్నారు.

జాగ్రత్తలు వివరిస్తున్నాం

మండలంలో నీటి వనరులున్న గ్రామాల రైతులు చెరకు పంటను కార్మిలననురించి చెరకు ప్లాంటేషన్ వేయడం జరుగుతుంది. అందుకు అవసరమైన ఎరువులు సకాలంలో వేయడంతో చెరకు తోటలు ఏపుగా పెరగడంతో చెరకు దిగుబడి పెరుగుతుంది. ఇంకా పెరగడానికి వీలుగా చెరకు పంట పడిపోకుండా గొలుసు విధానంతో కట్టడం, గుడ్డాం కట్టులు వేయడం జరుగుతుంది. ఎక్కడా చెరకు పంట నష్టం వాటిల్లకుండా రైతులు జాగ్రత్తలు పడుతున్నారు. ఏపుగా పెరుగుతున్న చెరకు తోటకు గాలి, వెలుతురు, నీరు సమృద్ధిగా ఉండే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.అవినాష్, ఏఓ, సీతానగరం

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు

మక్కువ: పారిశుద్ధ్య నిర్వహణపై మండల స్థాయి అధికారులు సమన్వయంతో సమష్టిగా పని చేయాలని లేకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ పి.దేవకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మండల స్థాయి అధికారులతో పారిశుద్ధ్యంపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి వచ్చే నెల 3 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలను కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించాలని సూచించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు విజృంభించే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. అన్ని గ్రామాల్లో బ్లీచింగ్ అందుబాటులో


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ దేవకుమార్

ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు, తాగునీరు, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

పాలకొండ రూరల్: కౌలురైతుల గుర్తింపునకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ పి.సన్యాసిరావు అన్నారు. పట్టణ పరిధిలోని పెద్దకాపువీధి సాయిమందిరంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించి, కౌలురైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌలురైతుగా గుర్తింపు పొందేందుకు సదరు రైతు వారు కౌలుకు సేద్యం చేస్తున్న భూయజమాని ఆధార్, వన్ బీ, దరఖాస్తుపై యజమాని సంతకం, పాస్‌ఫోటో, ఫోన్ నంబర్ తీసుకురావాలన్నారు. కౌలురైతు గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వ పరమైన సంక్షేమ రాయితీలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఆర్వో బలివాడ సాయి, పట్టణ వ్యవసాయ సహాయకుడు సాయి మహేష్, భూ యజమానులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

రుణఅర్హత కార్డులతో ప్రయోజనాలు..

వీరఘట్టం: రుణఅర్హత కార్డులతో కౌలురైతులకు


కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఆర్ఐ లక్ష్మన్నాయుడు అన్నారు. మండలంలోని బొడ్లపాడు, రేగులపాడు, కొంచ, హుస్సేనుపురం, కత్తులకవిటి, ఎం.రాజపురం, కుంబిడి, చిట్టపులివలస, విక్రమపురం, శ్రీహరిపురం, మొదటి కెల్ల, కడకెల్ల, నడిమికెల్ల, కంబర రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించి కౌలురైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీలు


ఎరువుల నిల్వలను, విక్రయ రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలోని ఖరీఫ్ సీజనులో రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉండేలా డీలర్లు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. బూర్జనాయుడు ఫెర్టిలైజర్స్, విజయరామ ఫెర్టిలైజర్స్, డిపోలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాల దృష్ట్యా రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అదే విధంగా ఎరువుల కొనుగోలు చేసిన రైతులందరికీ విధిగా రసీదులు ఇవ్వాలని, రైతులు పొందాలని, ఎరువులు లభ్యతను డిపోల వద్ద ధరల పట్టిక, నిల్వలు, విక్రయ వివరాల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. ఎరువుల దస్త్రాలను పరిశీలించి నిల్వల రికార్డులు విధిగా అందుబాటులో ఉంచాలని, తనిఖీ చేసే అధికారులకు కనిపించే విధంగా ఉంచాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


దాము మహేష్, గుసుపూరు గణేష్, బి.దినేష్‌కుమార్, వంగపండు లోకేశ్వరి, సీహెచ్ మౌనిక, కె.అఖిల్ అభిరాం, కె.సాయితరుణ్‌రెడ్డి, పి.స్టీఫెన్

సీతానగరం: ట్రిపుల్ ఐటీ విద్యాలయాల్లో ప్రవేశాలకు మండలంలోని బూర్జ, గాదెలవలస ఉన్నత పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శంకరరావు, రామకృష్ణ అభినందించారు. గాదెలవలస ఉన్నత పాఠశాలకు చెందిన బి.దినేష్, సీహెచ్ మౌనిక, వి.లోకేశ్వరి, బూర్జ ఉన్నత పాఠశాలకు చెందిన గుఋపూరు గణేష్, దాము మహేష్ ఎంపికయ్యారు. జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నుంచి ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు అనుమతులు వచ్చాయి. కె.అఖిల్‌అభిరాం, కె.సాయిధరుణ్‌రెడ్డి, పి.స్టీఫెన్‌కు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు అనుమతులు వచ్చాయని ప్రిన్సిపాల్ ధర్మరాజు తెలిపారు. వీరిని ఎంఈఓ జి.సూరిదేముడు అభినందించారు.

పెదంకలాంలో పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ ఆధ్వర్యంలో పెదంకలాం, తామరఖండి, పెదబోగిలి, సూరంపేట గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు జరిగాయి. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు నిర్వహించడం, కాలువల్లో పూడికలు తీయించడం, క్లోరినేషన్ చేయించడం, పిచ్చిమొక్కల తొలగింపు తీసిన చెత్తకుప్పలను దూర ప్రాంతానికి తరలించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో పెదంకలాం పీహెచ్‌సీ ప్రాంగణం, మంచినీటి పథకం నీటి ఓవర్‌హెడ్ చుట్టుపక్కలా శుద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.


పెదంకలాంలో జేసీబీతో పారిశుద్ధ్య పనులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని 18, 19, 20 వార్డుల్లో నిర్వహిస్తున్న డ్రైన్ డీసిల్టింగ్ పనులను శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెలగాం ప్రాంతంలోని పలు వీధులలో గల సమస్యలను గుర్తించామన్నారు. త్వరలో వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. 25వ వార్డుకు సంబంధించిన సామాజిక మరుగుదొడ్లును పరిశీలిస్తామని తెలిపారు. డీఈ, ఏఈ, స్థానిక కౌన్సిలర్, కాంట్రాక్టర్ రామారావు పాల్గొన్నారు.

గిరి విద్యార్థుల్లో ఆందోళన

పార్వతీపురం టౌన్: ఏకలవ్య పాఠశాలలో హిందీ మాధ్యమంతో బోధన వల్ల గిరి విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్ అన్నారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, అనసభద్ర, కొటికిపెంట ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇటీవల నూతన ఉపాధ్యాయులు నార్త్ ఇండియా నుంచి వచ్చారని, వారు హిందీ మాధ్యమంలో బోధించడంతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఇంగ్లిష్, తెలుగులో బోధించే వారు ఇప్పుడు సైన్స్, సోషనల్, ఇంగ్లిష్, లెక్కలు సైతం హిందీలోనే బోధన జరుగుతుందన్నారు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు మరింత ఆందోళన చెందుతున్నారన్నారు. హిందీ తప్ప మరే ఇతర భాషలు రావటం లేదని ఏకలవ్య పాఠశాలలో పరిస్థితులు చక్కబడే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలలన్నారు. ఈ పాఠశాలలపై సమీక్ష జరపాలని, గిరిజన విద్య కాపాడాలని కోరారు.

పశువ్యాధులకు టీకాలే రక్ష


గొంతువాపు సోకిన గేదే

- పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

పార్వతీపురం: వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధుల బెడద అధికంగా ఉంటుంది. వీటిని రక్షించుకోవాలంటే పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాల్సిన అవసరం ఉంది. సాధారణంగా వర్షాకాలం వస్తోందంటే పశువుల పెంపకందారుల్లో ఆందోళన రేగుతుంది. పశు వ్యాధులపై ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో రైతులు వ్యవసాయ ఆధారిత పంటలతో పాటు పాడి పరిశ్రమలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. ఈ పరిశ్రమకు ఆధారమైన పశువుల పట్ల రైతులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ వైద్యులు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, చిటుక వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధులు జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ తొలకరి వర్షాల సమయంలో సంభవిస్తుంటాయి. ఈ వ్యాధి సోకిందంటే పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గినట్లుగా రైతులు భావించాలి. ఈ వ్యాధులతో పాల దిగుబడి తగ్గడంతో ఆదాయ మార్గాలు తగ్గిపోతాయి. దాంతో రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమలోనూ నష్టాలను చవి చూడాల్సి వస్తుంది. జిల్లాలోని కురుపాం, పార్వతీపురం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల్లో ఆవులు 1,37,458, గేదెలు, గొర్రెలు 36,253, మేకలు 48,860, గొర్రెలు 39,750 వరకూ ఉన్నట్లు వైద్యాధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో పాడి రైతులకు అధికారులు పశు సంరక్షనకు పలు సూచనలు చేస్తున్నారు.

జూన్ నెలఖారు వరకు జిల్లాలో వేసిన టీకాల వివరాలు...

వేసిన వ్యాక్సిన్లు	పశువులు
గాలికుంటు వ్యాధి నివారణకు (ఎఫ్ఎండీ)	2,76,384
పారుడు రోగం (సీపీఆర్)	45,200
ముద్దచర్మ వ్యాధి (ఎల్ఎస్‌డీ)	1800
జబ్బ వాపు(బిక్యూ)	2200
చిటుక రోగం(ఈటీ)	2450
గొంతు వాపు(హెచ్ఎస్)	8,200
నీలినాలుక(బీటీ)	16,800
యాంటీరాబిస్(ఏఆర్‌వీ)	3,200
గోట్‌పాక్స్	11,550
కొక్కెర(ఆర్‌డీ)	38,000


ఉల్లిబద్రలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

● గాలికుంటు వ్యాధి

వైరస్ లేదా కలుషితమైన గాలి ద్వారా ఈ వ్యాధి వస్తుంది. తల్లిపాల ద్వారా దూడలకు సోకే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో గేదె, ఎద్దు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. కాలి గిట్టలు ఉన్న ప్రతి జీవికీ ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వర్షాలు ఎక్కువగా ఉండి చలిపెడుతున్నప్పుడు ఈ వ్యాధి విజృంభిస్తుంటుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు నోటి, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3, 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా ఏర్పడతాయి. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం వల్ల పశువులు మేత తీసుకోలేక నీరసించి పోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో నేలలు చిత్తడిగా ఉండడంతో గాలి కుంటు వ్యాధులు వస్తుంటాయి.

నివారణ చర్యలు

ఈ వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పర్మాంగనైట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె రాయాలి. యాంటిబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది.

● గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చేది గొంతువాపు వ్యాధి. దీనినే గురక వ్యాధి అంటారు. వర్షాకాలంలో గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. ఒక్కోసారి గొర్రెలు, మేకలు, పందుల్లోనూ కనిపిస్తుంది. ఇది అంటువ్యాధి కావడంతో ఇతర పశువులకు వ్యాపిస్తుంటుంది. కలుషితమైన నీరు, మేతలవల్ల పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గి వ్యాధులు సంక్రమిస్తుంటాయి. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతూ గురక, శ్వాస పీల్చడం కష్టమవుతుంది. జ్వర తీవ్రత 106, 107 డిగ్రీల వరకూ ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి గొంతువాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో చికిత్స అందించకపోతే మరణం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

నివారణ చర్యలు

వర్షాకాలం ముందు జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని, గదులను ఫినాయిల్ క్రిమి సంహారక ద్రావకంతో పరిశుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే పశువుల మంద నుంచి వేరుచేయాలి. వ్యాధి సోకిన పశువులకు వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిన్ వంటి ఇంజక్షన్లు ఇవ్వాలి. తప్పనిసరిగా పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

జబ్బ వాపు

ఈ వ్యాధి క్రీలాస్టిడియం చావై అనే బ్యాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంటుంది. ఈ వ్యాధి పశువులకు ప్రాణహాని కలిగించే తీవ్రమైన అంటువ్యాధి. తెల్ల పశువుల్లో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు వయసున్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంటుంది. ఈ వయసులో పశువుకు రోగ నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. మట్టి ద్వారా, కలుషితమైన మేత, నీటి ద్వారా పశువు శరీరంలోకి ప్రవేశించి వ్యాధి సంభవిస్తుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాలను ఆశించి కుళ్లిపోయేలా చేస్తుంది. వాపుతో పశువులు కుంటుతాయి. వెనుక కాలుగాని ముందు కాలుగాని పైకి లేపి కుంటుతుంటాయి. దీని నివారణకు వ్యాక్సిన్ ఒక్కటే మార్గమని పశువైద్యులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో వర్షాలు కారణంగా పశువులశాలల వద్ద శుభ్రత లోపిస్తుంది. దీంతో పశువులకు అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంది. పాడి రైతులు పశువులను జాగ్రత్తగా పర్యవేక్షణ చేసి వ్యాధులపై అవగాహన కలిగి వుండాలి. ఎలాంటి అనుమానం వచ్చినా దగ్గరలోని పశువైద్యులను సంప్రదించి సలహాలు తీసుకోవాలి.

– డా.ఎస్.మన్మథరావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి, పార్వతీపురం మన్యం